## క్లుప్తంగా

### దసరా శుభాకాంక్షలు


మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి


మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి


సమన్వయకర్త వీరాంజనేయులు

**తాడిపత్రిటౌన్/ గుంతకల్లు టౌన్/శింగనమల:** తాడిపత్రి, గుంతకల్లు మాజీ ఎమ్మెల్యేలు కేతిరెడ్డి పెద్దారెడ్డి, వై.వెంకటరామిరెడ్డి నియోజకవర్గ ప్రజలకు శుక్రవారం దసరా శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ విజయానికి ప్రతీక దసరా అని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో మెలగాలని అమ్మవారిని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామన్నారు. ఈ మేరకు వారు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. అలాగే శింగనమల నియోజకవర్గ ప్రజలందరికీ అన్నింటా విజయాలే కలగాలని, దుర్గాదేవి ఆశీస్సులతో సుఖ సంతోషాలతో ఉండాలని వైఎస్సార్‌సీపీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలందరికీ శుక్రవారం ఆయన విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

### తపాలా సేవలను సద్వినియోగం చేసుకోండి


శింగనమలలో అవగాహన కల్పిస్తున్న పోస్టల్ సిబ్బంది

**శింగనమల/యల్లనూరు:** కేంద్ర ప్రభుత్వం తపాలా శాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని పోస్ట్ మాస్టర్ పవన్‌కుమార్‌రెడ్డి సూచించారు. శుక్రవారం శింగనమలలో పోస్టల్ సిబ్బంది ర్యాలీ నిర్వహించి, సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పోస్టాఫీస్ ద్వారా పీఎల్ఐ, ఆర్పీఎల్ఐ, సుకన్య సమృద్ధి యోజన, సేవింగ్స్ అకౌంట్స్, రికరింగ్ డిపాజిట్లు, టైం డిపాజిట్, మంత్లీ ఇన్కమ్ స్కీం, ఎన్నారైజీఎస్ ఐపీపీబీ, మొబైల్ బ్యాంకింగ్, మహిళా సమాన్ యోజన పథకాలను అందిస్తోందన్నారు. కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది నాగరాజు, అబ్దుల్ నబి, బాలకృష్ణారెడ్డి, సత్యమూర్తి, దీపిక, భాగ్యలక్ష్మి, వసంత తదితరులు పాల్గొన్నారు. అలాగే యల్లనూరులో సబ్ పోస్టుమాస్టర్ కిరణ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ పోస్టల్ డేపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రమేష్‌రెడ్డి, బీపీఎంలు, సిబ్బంది కేశవ, అశోక్, యల్లయ్య, రవి, ఏజెంట్ విజయ్ పాల్గొన్నారు.

### స్నేహితుల ఆర్థిక చేయూత


అన్వర్ కుమార్తెల చదువు కోసం రూ. 50 వేలు అందజేస్తున్న స్నేహితులు

**గుత్తి:** మిత్రుడు పేదరికంలో ఉన్నాడని, కుమార్తెలను చదివించడం కష్టమని తెలుసుకున్న స్నేహితులు రూ. 50 వేలు నగదు అందజేశారు. వివరాలు.. గుత్తి పట్టణంలోని చెర్లోపల్లి కాలనీకి చెందిన అన్వర్ ఆటో నడుపుతూ ఇద్దరు కుమార్తెలను చదివిస్తున్నాడు. అయితే అన్వర్‌కు ఆర్థిక ఇబ్బందులు ఎదురవడంతో కుమార్తెలను చదివించడం కష్టమైంది. 1989లో అన్వర్‌తో కలిసి పదో తరగతి చదువుకున్న స్నేహితులు ఈ విషయాన్ని గ్రహించారు. వెంటనే చందాలు వేసుకుని రూ. 50 వేలు వసూలు చేశారు. స్నేహితులు శుక్రవారం అన్వర్ ఇంటికి వెళ్లి రూ. 50 వేలు అందజేశారు. కుమార్తెలను బాగా చదివించాలని తామందరం చేదోడు వాదోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు. వారికి అన్వర్‌తో పాటు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

### నివాళి


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సమన్వయకర్త వీరాంజనేయులు

**శింగనమల:** మండలంలోని చిన్నజలాలపురంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త నారాయణమ్మ శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు ఆ గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎస్వీ నారాయణ, నాయకులు రామకృష్ణారెడ్డి, లోకనాథ్ నివాళులర్పించారు.

# ఘనంగా ఆయుధపూజ

తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో శుక్రవారం ఆయుధ పూజ ఘనంగా నిర్వహించారు. ప్రజలు తమ వాహనాలకు పూజ చేయగా.. కార్మికులు పనిముట్లకు పూజలు చేశారు. దసరా సందర్భంగా ఆలయాలు కిటకిటలాడాయి.


గుంతకల్లులో పూజల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని


గుత్తిలో నిర్వహించిన ఆయుధపూజలో పాల్గొన్న కమిషనర్, చైర్‌పర్సన్

- కిటకిటలాడిన ఆలయాలు
- ఊపందుకున్న దసరా సంబరాలు

**గుంతకల్లుటౌన్:** విజయదశమిని పురస్కరించుకుని శుక్రవారం మున్సిపల్ ఇంజినీరింగ్, లైటింగ్ విభాగాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, అసిస్టెంట్ కమిషనర్ లావణ్య ఆయుధపూజ ఘనంగా నిర్వహించారు. ఉద్యోగ, కార్మికులు విధి నిర్వహణలో ఉపయోగించే పనిముట్లను శుభ్రం చేసి పూజ చేశారు. కార్యక్రమంలో ఏఈ హరికృష్ణ, ఎల్ఎస్.బాషా, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

**గుత్తి:** పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని ఆయుధ పూజ ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్ బీ, కమిషనర్ జబ్బార్ మియా, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**యల్లనూరు:** మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆయుధాలకు దసరా పండుగ పురస్కరించుకుని శుక్రవారం సీఐ సత్యబాబు, ఎస్ఐ రాం ప్రసాద్ ఆధ్వర్యంలో ఆయుధ పూజ ఘనంగా నిర్వహించారు. అనంతరం సీఐ, ఎస్ఐ, పోలీసు సిబ్బంది దుర్గాదేవి పూజల్లో పాల్గొన్నారు.

**గార్లదిన్నె:** మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా ఆధ్వర్యంలో విజయదశమి పురస్కరించుకుని ఆయుధ, వాహన పూజ ఘనంగా నిర్వహించారు.

**గుత్తి:** గుత్తి, గుత్తి ఆర్ఎస్‌లోని అన్ని దేవాలయాల్లో శుక్రవారం దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. భక్తులు భారీ ఎత్తున తరలివచ్చి ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో మూల మంత్ర హోమాలు, పూర్ణాహుతి, మహా మంగళ హారతి వంటి ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకుడు వాసుదేవశర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

**పామిడి:** పామిడిలో శుక్రవారం దసరా పండుగ సందడి నెలకొంది. ఈ సందర్భంగా ఆయుధపూజ ఘనంగా చేపట్టారు. వాహనాలు, పనిముట్లు, మిషన్లకు ప్రజలు భక్తిశ్రద్ధలతో ఆయుధపూజ చేశారు. పండుగ నేపథ్యంలో స్థానిక బీసీసీ రోడ్డు నిత్యావసర సరుకుల కొనుగోలుదారులతో కిక్కిరిసి పోయింది. కిరాణా షాపులు, వస్త్ర దుకాణాలు, పూజా సామగ్రి విక్రయ షాపులకు మంచి గిరాకీ లభించింది. అలాగే రోడ్లపై చెండు పూలు రాసులుగా పోసి విక్రయించారు.


గార్లదిన్నె పోలీస్ స్టేషన్లో ఆయుధ పూజ నిర్వహిస్తున్న పోలీసులు


గుత్తిలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు


యాడికి: చండీ హోమంలో పాల్గొన్న ఎంపీపీ ఉమాదేవి, బొంబాయి రమేష్ నాయుడు దంపతులు


తాడిపత్రి అర్బన్: రాజరాజేశ్వరీ దేవిగా పార్వతీదేవి


గుత్తిలో కంచి కామాక్షి దేవిగా వాసవీ మాత


గుంతకల్లు: మధుర మీనాక్షి దేవిగా వాసవీ మాత

## జగజ్జననీ మనసాస్మరామీ..

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం జగన్మాత వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చింది. మహిళలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు –సాక్షి నెట్‌వర్క్


గార్లదిన్నె మండలం కల్లూరులో కంచి కామాక్షి దేవిగా అమ్మవారు


శింగనమల: మహిషాసుర మర్దనిగా వాసవీమాత


పెద్దవడుగూరు : మహిషాసుర మర్దినిగా అమ్మవారు


గుత్తి రూరల్: సేవాగఢ్‌లో మహిషా సురమర్దినిగా..


తాడిపత్రి అర్బన్: రాజరాజేశ్వరీ దేవిగా కాళికాంబ


పామిడిలో నారాయణిదేవిగా వాసవీ మాత

## వైభవంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం


వేంకటేశ్వరస్వామి రథాన్ని లాగుతున్న అనంత వెంకటరామిరెడ్డి, నార్పల సత్యనారాయణరెడ్డి

**నార్పల:** దేవీ నవరాత్రుల సందర్భంగా నార్పల వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వేంకటేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ నాయకుడు, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి కుటుంబ సమేతంగా హాజరయ్యారు. అనంతరం వారు స్వామి రథాన్ని లాగి ఉత్సవాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున శ్రీవారిని దర్శించుకుని గోవింద నామస్మరణల మధ్య రథాన్ని లాగారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందించారు.

## రోడ్డు ప్రమాదంలో 9 మందికి గాయాలు


తలగాచిపల్లి వద్ద జాతీయ రహదారిపై బోల్తాపడిన బెల్లం పాక్ ట్యాంకర్


పొలాల్లోకి దూసుకుపోయిన తెలంగాణా ఆర్టీసీ బస్సు

**గార్లదిన్నె:** మండలంలోని తలగాచిపల్లి క్రాస్ సమీపంలో 44వ జాతీయ రహదారిపై రోడ్డుపై బోల్తాపడిన బెల్లం పాక్ ట్యాంకర్‌ను తెలంగాణ ఆర్టీసీ బస్సు ఢీకొని తొమ్మిది మందికి గాయాలైన సంఘటన గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్తున్న బెల్లం పాక్ ట్యాంకర్‌ను డ్రైవర్ వసంతరావు మద్యం సేవించి అతివేగంగా నడుపుకుంటూ వచ్చాడు. 44వ జాతీయ రహదారి తలగాచిపల్లి వద్దకు రాగానే వాహనం రోడ్డు మధ్యలో డివైడర్ ఎక్కించడంతో అవతలి వైపు రోడ్డుపై ట్యాంకర్ బోల్తా పడింది. అదే సమయంలో బెంగళూరు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న తెలంగాణ ఆర్టీసీ బస్సును డ్రైవర్ శ్యాముల్ అప్రమత్తమై ట్యాంకర్‌ను తప్పించబోయి సమీపంలోకి పొలాల్లోకి మళ్లించాడు. దీంతో బస్సులో ఉన్న గౌడ్, వయారెడ్డి, గురుమూర్తి, మునిస్వామి, సుప్రీత్, గోపీకృష్ణ, ఆషిక్ బాబు, పూర్ణిమ గాయపడ్డారు. సమాచారం అందుకున్న సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనంలో పామిడి ప్రభుత్వాస్పత్రికి తరలించారన్నారు. మిగిలిన ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా మరో బస్సులో హైదరాబాద్‌కు పంపారు. ట్యాంకర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ముగిసిన 'మద్యం షాపుల' దరఖాస్తు పక్రియ


దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

**బుక్కరాయసముద్రం:** బుక్కరాయసముద్రం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బీకేఎస్, నార్పల, గార్లదిన్నె, శింగనమలలోని మద్యం షాపులకు దరఖాస్తు పక్రియ శుక్రవారం ముగిసింది. మొత్తం 15 మద్యం దుకాణాల నిర్వహణ కోసం ఈ నెల 1 నుంచి 11వ తేదీ వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పక్రియ ద్వారా దరఖాస్తు పక్రియ నిర్వహించామని ఎక్సైజ్ సీఐ నాగ సునీత తెలిపారు. బీకేఎస్, శింగనమల, నార్పల, గార్లదిన్నె మండలాల నుంచి 530 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇందులో బీకేఎస్ మండలంలో 4 షాపులకు 165 దరఖాస్తులు, శింగనమలలో 3 షాపులకు 90, నార్పలలో 4 షాపులకు 165, గార్లదిన్నె మండలంలో 4 షాపులకు 94 దరకాస్తులున్నాయి. ఈ నెల 14న లాటరీ పద్ధతిన మద్యం దుకాణాలు కేటాయిస్తామన్నారు.

## దసరా పండుగను ప్రశాంతంగా జరుపుకోండి

**యల్లనూరు:** మండల వ్యాప్తంగా ప్రతి ఒక్కరూ దసరా పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని , సమస్యలు సృష్టిస్తే ఎంతటివారినైనా వదిలేది లేదని పుట్లూరు సీఐ సత్యబాబు హెచ్చరించారు. శుక్రవారం యల్లనూరు పోలీస్‌స్టేషన్ సీఐ తనిఖీ చేశారు. సీఐ మాట్లాడుతూ శని, ఆదివారాల్లో పల్లెల్లో ప్రశాంతమైన వాతావరణంలో పండుగ జరుపుకోవాలన్నారు. ఏవైనా సమస్యలు సృష్టిస్తే జైలుకు పంపుతామన్నారు. ఆయన వెంట ఎస్ఐ రాం ప్రసాద్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## 14 నుంచి 'పల్లె పండుగ' వారోత్సవాలు

**పుట్లూరు/యల్లనూరు/పెద్దవడుగూరు/గార్లదిన్నె:** మండలవ్యాప్తంగా ఈ నెల 14 నుంచి పల్లెపండుగ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు పుట్లూరు ఎంపీడీఓ అలివేలమ్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ కింద మంజూరైన పనులను ప్రారంభించనున్నట్లు ఆమె వివరించారు. ఈ నెల 14 నుంచి 21 వరకూ గ్రామాల్లో పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. యల్లనూరు, పెద్దవడుగూరు, గార్లదిన్నె మండలాల్లో నిర్వహించే 'పల్లె పండుగ' కార్యక్రమాలను విజయవంతం చేయాలని యల్లనూరు ఇన్‌చార్జి ఎంపీడీఓ వాసుదేవరెడ్డి, పెద్దవడుగూరు ఎంపీడీఓ బరెన్‌సాహెబ్, గార్లదిన్నె ఎంపీడీఓ యోగానందరెడ్డి సూచించారు.

## కాంట్రాక్ట్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

**పామిడి:** పామిడిలో కస్తూరిబా పాఠశాల, ఏపీ మోడల్‌స్కూల్‌లో ఖాళీగా ఉన్న కాంట్రాక్ట్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ జయానాయక్ సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ స్థానిక కేజీబీవీలో టైప్–3కు సంబంధించి హెడ్ కుక్, స్వీపర్ పోస్టులు ఖాళీ ఉన్నాయన్నారు. ఏపీ మోడల్‌స్కూల్‌లో టైప్–4కు గానూ ఒకటి చొప్పున హెడ్‌కుక్, వాచ్‌మెన్ పోస్టులు, అసిస్టెంట్ కుక్‌లు–2 ఖాళీ ఉన్నాయన్నారు. మొత్తం 6 పోస్టులకు ఆసక్తి ఉన్నవారు ఈ నెల 15లోపు ఎమ్మార్సీలో దరఖాస్తులు అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు ఎమ్మార్సీలో సంప్రదించాలన్నారు.

## మార్కెటింగ్‌పై అవగాహన

**తాడిపత్రిటౌన్:** పట్టణంలోని మున్సిపల్ బాయ్స్ హైస్కూల్ విద్యార్థులకు స్కిల్ డెవలెప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా హెచ్ఎం నటరాజ్, ఒకేషనల్ ట్రైనర్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో స్థానిక మోడరెన్ సూపర్ మార్కెట్‌లో 10 రోజుల ఇంటర్నషిప్ పోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా 10 వతరగతికి చెందిన 8 మంది విద్యార్థులకు మార్కెటింగ్‌పై అవగాహన కల్పించారు. శుక్రవారం ట్రైనింగ్ పూర్తయిన సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

## గాయత్రీ ఆయిల్ మిల్‌లో ఇష్టారాజ్యంగా ధరలు

**బుక్కరాయసముద్రం:** దసరా పండుగ సందర్భంగా సందట్లో సడేమియా అన్న చందంగా ఆయిల్ మిల్ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా ఆయిల్ ధరలు పెంచి సొమ్ము చేసుకుంటున్న వైనం బీకేఎస్‌లో చోటు చేసుకుంది. వివరాలు.. బీకేఎస్ మండల కేంద్రంలోని చెరువుకట్ట సాయిబాబా కల్యాణ మండపం సమీపంలోని అనంతపురం తాడిపత్రి రహదారి పక్కన గాయత్రీ ఆయిల్ మిల్ నిర్వహిస్తున్నారు. ఈ ఆయిల్ మిల్ నుంచి నగరంలోని పలు ఆయిల్ షాపులకు వేరుశనగ నూనె, చమురు, పొద్దు తిరుగుడు నూనె, కొబ్బెర నూనె, పామాయిల్‌ను కిలో, 5 కిలోలు, 10 కిలోలు, 20 కిలోలను డబ్బాలు, బాక్సుల రూపంలో సరఫరా చేస్తున్నారు. ఇది ఇలా ఉండగా రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన నూనె ప్రజలకు తక్కువ ధరకే విక్రయించాలని జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఆయిల్ ట్రేడర్స్ అసోసియేషన్‌కు ఆదేశాల జారీ చేశారు. గాయత్రి ఆయిల్ మిల్ వారు రోడ్డు ప్రక్కన పామాయిల్ ప్యాకెట్ రూ.118, సన్ ఫ్లవర్ లీటరు రూ.127 అంటూ బ్యానర్ కట్టారు. ప్రజలకు మాత్రం పామాయిల్ రూ.125, సన్‌ఫ్లవర్ రూ.135కు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వ ఆదేశాలను ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా సివిల్ సప్లై అధికారులు గాయత్రి ఆయిల్ మిల్‌పై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. కాగా గతంలో గాయత్రి ఆయిల్ మిల్‌ను రికార్డులు సక్రమంగా లేవని, ఆయిల్‌లో కల్తీ ఉందని విజిలెన్స్ అధికారులు సీజ్ చేసిన సంగతి తెలిసిందే.

## అన్నదానం గొప్పది

**గుత్తి:** అన్ని దానాల కంటే అన్నదానం చాలా గొప్పదని సీఐ వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకుడు నారాయణ అన్నారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం రామాంజనేయులు అనే వ్యక్తి గర్భిణులు, బాలింతలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు గర్భిణులకు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు.

## తిరుమలలో నృత్య ప్రదర్శన


నృత్య పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులు

**గుత్తి:** గుత్తి పట్టణంలోని అరవింద్ డాన్స్ అకాడమీలో శిక్షణ పొందిన విద్యార్థినులు తిరుమలలో టీటీడీ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన నృత్య పోటీల్లో ప్రతిభ చూపారు. నిర్వాహకులు వారికి జ్ఞాపికలతో పాటు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

## నిత్యావసర కిట్ల అందజేత

**తాడిపత్రిటౌన్:** పట్టణంలోని వివేకానంద స్కూల్‌లో శుక్రవారం ఉద్యోగ ఉపాధ్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో 20 కుటుంబాలకు నిత్యావసర సరుకుల కిట్లను అందజేశారు. నిరుపేదలు దసరా పండుగను ఆనందంగా చేసుకోవాలనే ఉద్దేశంతో సరుకులు అందజేసినట్లు సంస్థ అధ్యక్షుడు గురప్ప తెలిపారు. కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షుడు శ్రీహరి, కన్వీనర్ నారబోయిన శంకర్, కో కన్వీనర్ కరుణాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## మట్కా బీటర్ల అరెస్ట్

**పెద్దవడుగూరు:** మండలంలోని విరుపాపురం గ్రామ సమీపంలో మట్కా రాస్తున్న ఇద్దరిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చిన్నరెడ్డప్ప తెలిపారు. వారి నుంచి రూ.10,450 నగదు, చీటీలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.